అగమ్యగోచరం

- గందరగోళంలో విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయుల భవితవ్యం
- నేటికీ ప్రారంభం కాని తరగతులు
- మార్చి నుంచి అందని జీతాలు
- స్పందించని ఉక్కు యాజమాన్యం, ప్రజాప్రతినిధులు,



ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు



పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ విశాఖ విమల విద్యాలయం (వీవీవీ) ఉపాధ్యాయుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. పాఠశాల కొనసాగింపుపై ఉక్కు యాజమాన్యం సానుకూలంగా లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం తరగతులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు పలుచోట్లకు చెదిరిపోగా పాఠశాల ఉపాధ్యాయులు 8 నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నారు.

సుమారు 40 ఏళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సామాజిక బాధ్యతగా నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులు, బలహీన వర్గాల కోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేసింది. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక సాయంతో నామమాత్రపు ఫీజుతో నగరానికి చెందిన డయాసిస్ ఆఫ్ రోమన్ క్యాథలిక్ మిషనరీ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. గత 40 ఏళ్లుగా వేలాది మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించారు. పాఠశాల మూసే నాటికి సుమారు 1400 మంది విద్యార్థులు ఉండేవారు. ఇందులో ప్రస్తుతం శాశ్వత ఉపాధ్యాయులు 28 మంది పని చేస్తున్నారు. శాశ్వత ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి ఉక్కు యాజమాన్యం, పాఠశాల యాజమాన్యం మధ్య జరిగే ఎంవోయూ మేరకు పాఠశాల నిర్వహణ కొనసాగుతుంది. ఈ ఏడాది ఎంవోయూ కొనసాగింపునకు ఉక్కు యాజమాన్యం సానుకూలంగా లేకపోవడంతో ఈ ప్రతిష్టంభన నెలకొంది. దీంతో 1400 మంది పేద విద్యార్థులు రోడ్డున పడ్డారు. పాఠశాల తెరుస్తారని ఎదురుచూసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉక్కు యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో పాఠశాల కొనసాగించాలని ఆందోళన చేశారు. చివరకు విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చేరిపోగా ఉపాధ్యాయులు మిగిలిపోయారు. వీరంతా రోజూ పాఠశాలకు రావడం, సాయంత్రం ఇంటికి వెళ్లిపోవడం జరుగుతోంది. ఈ ప్రతిష్టంభన వల్ల ఈ ఏడాది మార్చి నుంచి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడం లేదు. దీంతో వారు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉక్కు యాజమాన్యానికి కలెక్టర్ లేఖ

పాఠశాల ఉపాధ్యాయులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా సర్వీసు రూల్స్ వేతనాలు తీసుకున్న తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందించి పాఠశాల తెరిపించడం లేదా నడిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని ఉక్కు యాజమాన్యానికి లేఖ రాశారు. అయినప్పటికీ ఉక్కు యాజమాన్యం నుంచి స్పందన కనిపించడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల సమస్యకు పరిష్కారం పూర్తిగా ప్రజాప్రతినిధుల చేతుల్లోనే ఉంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాన్ని ఒప్పించలేని పరిస్థితి ఉంటే వారు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి పాఠశాలను గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా చేసేలా ఒత్తిడి తేవాలి. తద్వారానే ఉపాధ్యాయులు, ఈ ప్రాంతంలో పేద, బడుగు వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించే అవకాశం ఉంటుంది.

పాఠశాలను కొనసాగించాలి



స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుమతితో తమను నియమించారు. తమకు ఎన్నో అవకాశాలు వచ్చినా ఇక్కడే కొనసాగాం. ఉద్యోగుల పిల్లలు వేలాది మంది ఇక్కడ చదువుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా పాఠశాలను మూసేస్తే ఉపాధ్యాయుల పరిస్థితి ఏంటి. పాఠశాలను నడిపించాలి... లేదంటే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాలను కొనసాగించాలి.

– బి.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా..

ఉక్కు యాజమాన్యం నుంచి సానుకూల స్పందన **రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే, విశాఖ ఎంపీలను ఉపాధ్యాయులు** పలుమార్లు కలిశారు. **ఉక్కు యాజమాన్యం** పునఃప్రారంభించకపోతే **రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో** పాఠశాలను **నడిపించాలని విజ్ఞప్తి చేశారు.** ఎమ్మెల్యే **తాను ఉక్కు యాజమాన్యంతో** చర్చించానని... **అయితే వారు నిర్ణయం** తీసుకోవాల్సి **ఉందని చెబుతున్నట్టు సమాచారం. ఉక్కు యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని** పాఠశాల **నడపాలని కోరితే** ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ఎమ్మెల్యే చెప్పినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పాఠశాలను తెరిపించడం లేదా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేలా ఒత్తిడి తేవాల్సిన ఎంపీ భరత్ మాత్రం విమల విద్యాలయం ఉపాధ్యాయులకు వీఆర్‌ఎస్ ఇవ్వాలని సిఫార్సు చేయడం పలు విమర్శలకు దారి తీస్తోంది.



40 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన విశాఖ విమల విద్యాలయం

ప్రత్యేక అవసరాల చిన్నారులకు బాసటగా నిలవాలి



చిన్నారి మేఘనకు వీల్ చైర్ అందజేస్తున్న ఎంఈవో రమణాజీ

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలని మండల విద్యాశాఖాధికారి కంకటాల రమణాజీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో మారి ఆర్గనైజేషన్ భవిత కేంద్రానికి అందించిన వాటర్ ప్యూరిఫైర్‌ను గురువారం రమణాజీ ప్రారంభించారు. అలాగే కండిపిల్లి మేఘన అనే విద్యార్థినికి అందించిన వీల్ చైర్‌ను ఆయన విద్యార్థినికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల్లో ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి భవిత కేంద్రంలోని చిన్నారుల సంక్షేమానికి పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జయభారతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల ప్రారంభం నేడు

పెదగంట్యాడ : ఎస్‌జీఎఫ్ పెదగంట్యాడ మండల స్థాయి క్రీడా, ఆటల పోటీలు శుక్రవారం ఉదయం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల, డివిజన్ కో ఆర్డినేటర్లు భానోజీరావు, రామచంద్రరావు తెలిపారు. అండర్ – 14, 17 (బాలురు) క్రీడా, అథ్లెటిక్స్ పోటీలు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నామని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే శనివారం బాలికలకు పోటీలు ఉంటాయని, క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులను డివిజన్ జట్లకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

క్లుప్తంగా

శేష జీవితం హాయిగా సాగాలి



గొందేశి వెంకటరమణారెడ్డిని సత్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

పెదగంట్యాడ : సుదీర్ఘకాలం పనిచేసి స్టీల్‌ప్లాంట్ ఉన్నతి కోసం పాటుపడిన గొందేశి వెంకటరమణారెడ్డి శేష జీవితం హాయిగా సాగాలని కాంట్రాక్ట్ కార్మికులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన రమణారెడ్డిని కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష, అప్పలస్వామి, కోటేశ్వరరావు, మల్లేష్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న సీడీపీవో నీలవేణి, తదితరులు

పెదగంట్యాడ : పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి పేర్కొన్నారు. పోషణ మహా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పెదగంట్యాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకుంటేనే తల్లి, శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను బాలింతలు, గర్భిణులకు వివరించారు. ఇంటి వద్దనే లభించే పదార్థాలతో మంచి పోషక విలువలుండే ఆహారం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మానస, గీత, లక్ష్మి, చెల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 228 మంది ఎంపిక

అగనంపూడి : ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 228 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇన్ఫోసిస్ ఇటీవల వివిధ దశల్లో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించింది. మూడు స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన 228 మందిని ఎంపిక చేసింది. ఈ మేరకు విజ్ఞాన్ కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లావు రత్తయ్య విద్యార్థులను అభినందించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు

గోపాలపట్నం: జీఎస్టీ తగ్గింపుపై రవాణా శాఖ, పర్యాటక శాఖ, ట్రాఫిక్ పోలీసులు గురువారం గోపాలపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. నిత్యావసర వస్తువులపై భారీగా పన్ను తగ్గిందన్నారు. విశాఖ పర్యాటక నగరం కావడంతో ఇక్కడికి వచ్చేవారికి, స్థానికులకు జీఎస్టీ భారం తగ్గిందని వివరించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు



షాట్‌పుట్ పోటీల్లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) పరవాడ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. మొదటి రోజు అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని 12 ఉన్నత పాఠశాలలకు చెందిన 2 వందల మంది విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. అండర్–14,17 విభాగాల్లో బాలురు, బాలికలకు అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించి డివిజన్ స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా షాట్‌పుట్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, షటిల్, లాంగ్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, క్లస్టర్ పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీలు క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపాలన్నారు. డివిజన్ స్థాయికి మంచి జట్లను పంపించడమే లక్ష్యమన్నారు. క్రీడాకారులకు శ్రద్ధ, క్రమశిక్షణ ఉంటే రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి



మదీనాబాగ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రమీల

పెదగంట్యాడ: పది పరీక్షలకు సమయం సమీపిస్తున్న ఈ పరిస్థితుల్లో ప్రణాళికాయుతంగా చదువుకోవాలని మండలంలోని ఇస్లామ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని గేదెల ప్రమీల అన్నారు. మండంలోని మదీనాబాగ్‌లోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు గురువారం రాత్రి వెళ్లి తల్లిదండ్రులతో విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సమయం తక్కువ ఉందని, సబ్జక్టుల వారీగా ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఉదయం, రాత్రి వేళల్లో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించాలన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలు, స్నేహితులకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సరైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వి.శ్రీనివాసరావు, ఆనందరావు, బ్రహ్మజీ, కె.పి.రావు, బి.అన్నాజీరావు, నిజాముద్దీన్, సీఆర్‌పీ దీనా తదితరులు పాల్గొన్నారు. అలాగే మదీనాబాగ్‌లో నాలుగు బృందాలుగా ఏర్పడి ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు.

రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు



స్పెన్సర్స్ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్



29వ వార్డులో పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న కమిషనర్

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేసి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–3, జోన్–4 పరిధి 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత పనులను కమిషనర్ పరిశీలించారు. జోన్–3 పరిధి మద్దిలపాలెం జంక్షన్ నుంచి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా పరిశుభ్రత పనులను పరిశీలిస్తూ, స్పెన్సర్స్ జంక్షన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు కమిషనర్ గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటన చెత్త తొలగించి, బాధ్యులైన దుకాణ యజమానులపై జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడంపై ఆయన దుకాణ యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 17, 20 వార్డుల పర్యటనలో భాగంగా పెదవాల్తేర్ గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ చెత్త తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని ఆదేశించారు. నివాసితులు, వ్యాపారులు తమ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేయాలని, వాడి పారేసిన కప్పులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. జోన్–4 పరిధి 29వ వార్డు దండుబజార్ వద్ద జీవీఎంసీ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. సమయానికి డ్యూటీకి హాజరు కావాలని, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు రోజువారీ పర్యవేక్షణ చేపట్టి, నగరాన్ని చెత్త రహితంగా ఉంచాలని ఆదేశించారు. వాకీ టాకీ ద్వారా జోనల్ కమిషనర్లు సంబంధిత ప్రాంతాల్లో సిబ్బంది, క్లాప్ వాహనాలు సక్రమంగా వినియోగించి, ప్రతిరోజూ పరిశుభ్రతపై పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

- రాత్రివేళ అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీవాసుల అగచాట్లు
- వెలగని చోట నెలల తరబడి వెలగవు.. వెలిగే చోట రాత్రీపగలు ఆరవు



అగనంపూడి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో అంధకారం



కొండయ్యవలస హైస్కూల్ ముందు వీధిలో నిత్యం వెలుగుతున్న వీధి దీపాలు

అగనంపూడి: జీవీఎంసీ విద్యుత్ దీపాల నిర్వహణ తీరుపై అగనంపూడివాసుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 85వ వార్డు అగనంపూడి మరిడిమాంబ కూడలి నుంచి సినిమా హాలు రోడ్డు, దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో వీధి దీపాలు గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. మరిడిమాంబ ఆలయ కూడలిలోని అధునాతన వీధిదీపాలు కూడా మసకబారాయి. జాతీయ రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ వెలుగులు కనుమరుగయ్యాయి. సెక్టార్–2, 3లోని పలు వీధుల్లో అరకొరగా వీధి దీపాలు వెలుగుతున్నాయి. చిన ఆంజనేయస్వామి ఆలయం కూడలి నుంచి సెక్టార్–3కి వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. సెక్టార్–2 నుంచి 3కి వెళ్లే రింగ్ రోడ్డులో కూడా వీధి దీపాల తీరు అలాగే ఉండడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క వర్షాలకు రోడ్లు ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వీధి దీపాల నిర్వహణపై జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు నిరసన వ్యక్తం చేశారు.

నిరంతరం వెలుగులు..

కొండయ్యవలసలో పలుచోట్ల నిరంతరం దీపాలు వెలుగుతున్నాయి. నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. హైస్కూల్‌కు వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి. ఇవి నిరంతరం వెలగడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, ఇవి పోతే మళ్లీ కొత్తవి అమర్చడానికి నెలల సమయం పడుతుందని స్థానికులు వాపోతున్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి సహకారం



రామాలయం పునర్నిర్మాణానికి విరాళం అందిస్తున్న పట్టా రామ అప్పారావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ పెదమడకలోని రామాలయ పునర్నిర్మాణానికి ఉక్కు విశ్రాంత ఉద్యోగి, వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు రూ.75 వేల నగదు అందించారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.50 వేలు అందించగా, గురువారం ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మరో రూ.25 వేలు నగదును రామ అప్పారావు దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు గుదే సుశీలా గజేంద్రరావు, విందుల నారాయణరావు, అమరపిని గోవిందరావు, మోటూరి వెంకట రమణ, మజ్జి శ్రీను, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ స్వర్ణోత్సవాల విస్మరణ తగదు

డాబాగార్డెన్స్: సమీకృత శిశు అభివృద్ధి పథకం 1975లో ప్రారంభమైందని, దీని వల్ల యావత్ దేశంలో పేద మహిళలు, పిల్లల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. సిటు కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ విశాఖ జిల్లా సదస్సులో ఆమె మాట్లాడారు. ఆ పథకం స్వర్ణోత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం తగదన్నారు. ఈ పథకం వల్ల ఎంతో మేలు జరుగుతుందని పలు నివేదికలు స్పష్టం చేసినా.. ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నట్టు కనపడుతోందని ఆరోపించారు. కీలకమైన ఐసీడీఎస్ పథకానికి మోదీ ప్రభుత్వం బడ్జెట్ తగ్గించడం ద్వారా నిర్వీర్యం చేయడాన్ని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరిట అర్హులైన వారిని తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఐసీడీఎస్‌లో కీలకంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీలకు జీతాలు పెంచని కారణంగా కేంద్ర మంత్రుల కార్యాలయాల వద్ద నవంబర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారుల సంఖ్య కుదించవద్దని నవంబర్ 14న చిన్న పిల్లలతో అన్ని జిల్లాల్లో ధర్నాలు చేయాలని తెలిపారు. సిటు అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్న నేపథ్యంలో వాటి విజయవంతానికి అంగన్‌వాడీలంతా కృషి చేయాలని కోరారు.

ప్లైవుడ్ కార్మికుల నిరసన

సీతంపేట: ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అన్నారు. కార్మికులతో కలిసి గురువారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచలేదని, నిత్యావసర సరకుల ధరలు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగాయని, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు పెరిగిపోవడంతో ఆర్థిక భారం పడుతోందన్నారు. కార్మికుల బాధలు అధికారులకు పట్టడం లేదన్నారు. కూలీ రేట్లు తక్షణమే పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. మేస్త్రీలు వై.రాజు, చిన్నారావు, వెంకటరావు, చంటి, సత్తిబాబు పాల్గొన్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. గురువారం ఉదయం మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లోని పలు రైళ్లలో రైల్వే భద్రతా దళం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సలీం పాషా, అమ్ముకుట్టి, నిషాదేవిలు కర్ణాటకకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వీరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించినట్లు మర్రిపాలెం ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపారు.